క్లుప్తంగా

దేశ సమగ్రతను కాపాడాలి



దేశ ఐక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న గణపవరం డిగ్రీ కాలేజీ విద్యార్థులు

గణపవరం: దేశ సమగ్రత, సమైక్యతలను కాపాడటానికి విద్యార్థులు, యువకులు సంసిద్ధులుగా ఉండాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. సోమవారం జాతీయ ఐక్యతాదినోత్సవం సందర్భంగా కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్- 1, 2ల ఆధ్వర్యంలో ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశం పట్ల, దేశ రక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని, దేశంకోసం ఏత్యాగాలు చేయడానికైనా వెనుకాడరాదని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. దేశ రక్షణకు కంకణబద్ధులై ఉంటామని, దేశ సమగ్రత, సమైక్యతలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు సీహెచ్ చైతన్య, జి.వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు: ప్రమాదవశాత్తు హఠాత్తుగా ఎవరైనా గుండె నొప్పి వచ్చి పడిపోయినప్పుడు వారికి ప్రథమ చికిత్స ఎలా చేయాలి అనే దానిపై దెందులూరు టీఆర్‌డీ నర్సింగ్ కళాశాల సీనియర్ విద్యార్థులు వివరించారు. సోమవారం విద్యార్థులకు సీపీఆర్ చికిత్సను ఏ విధంగా చేయాలన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదకర పరిస్థితిలో ఉన్నప్పుడు రోగికి ఏ విధంగా ఊపిరి అందించాలన్న విషయాన్ని విద్యార్థులకు ప్రాక్టికల్‌లో చేయించి చూపారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్‌పాస్‌లో తొలగని వర్షం నీరు



అండర్‌పాస్‌లో నిల్వ ఉన్న వర్షం నీరు

దెందులూరు : రైల్వే శాఖ మంచి ఉద్దేశంతో రూ.కోట్లు వెచ్చించి అండర్‌పాస్ నిర్మాణం చేశారు. దాని ఉపయోగం కంటే ఆ అండర్‌పాస్ నుంచి ప్రయాణించే వేలాది మంది ప్రయాణికులు నిత్యం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దాదాపు రూ.5 కోట్లకుపైగా నిధులు వెచ్చించి దెందులూరు- అలుగులగూడెం రైల్వే ట్రాక్ దిగువ అండర్‌పాస్ నిర్మించారు. కొద్దిపాటి వర్షానికే అండర్‌పాస్‌లో నీరు నిల్వ ఉంటోంది. రోజుల తరబడి ప్రజలు ఆందోళన చేసినప్పుడు మాత్రమే వర్షం నీటిని తొలగిస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి అండర్‌పాస్‌లో నీటి తొలగింపునకు శాశ్వత చూపాలని ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి



మహాత్మాగాంధీ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం

ఉంగుటూరు: విద్యార్థుల విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని అధ్యాపకులు సూచించారు. నారాయణపురం మహాత్మా గాంధీ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న కె.వెంకటరమణ, హెచ్ రంగారావు మాట్లాడుతూ విద్యార్థులు సక్రమంగా కళాశాలకు హాజరయ్యేలా, అధ్యాపకులు చెప్పిన పాఠ్యాంశాలను ఇంటి వద్ద శ్రద్ధగా చదివేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ యూనిట్, క్వార్టర్లీలో విద్యార్థుల ప్రగతిని, హాజరు శాతాన్ని వివరించారు. ఏజీఎం సీహెచ్‌వీవీ రామచంద్రరావు, పి.వెంకటేశ్వరరావు, కేవై నాయుడులు మాట్లాడారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

ఏలూరు రూరల్ : రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెరగాలని ఆశ్రం సీఈఓ హనుమంతురావు తెలిపారు. సోమవారం రొమ్ము క్యాన్సర్ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో వైద్య విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రం వైద్యులు, పారామెడికల్ కాలేజీ విద్యార్థులు, తదితరులు పింక్ రిబ్బన్ ఆకారంలో మానవహారం ఏర్పాటు చేశారు.

ప్రమాదం అంచున ప్రయాణం

- భారీ లోడు వాహనాలపై కార్మికుల ప్రయాణం
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా మారని తీరు
- పట్టించుకోని అధికారులు



లోడు లారీపై ప్రయాణిస్తున్న కార్మికులు



వ్యాన్‌పై కిక్కిరిసి ప్రయాణిస్తున్న దృశ్యం

గణపవరం: ఎలాగైనా గమ్యం చేరాలన్న ఆతృతతో కొందరు లోడు వాహనాలలో ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. లోడుతో వెళ్తున్న లారీలు ఎక్కి లోడుపై ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇక కూలీలు, కార్మికులు అయితే లోడుపైనే విశ్రాంతి తీసుకుంటూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా చేపల లోడుతో వెళ్లే లారీలపై నిరంతరం చేపలు ప్యాకింగ్ చేసే జట్టు కూలీలు ఐస్‌తో నింపిన చేపల ట్రేలమీదే ప్రయాణం చేస్తున్నారు. కొంతమంది అలసట తీర్చుకోవడానికి లోడుపైనే నిద్రిస్తున్నారు. ఇలా ఎలా పడితే అలా ప్రాయాణాలు చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

ప్రాణాలకు ప్రమాదం

గతంలో నిడమర్రు వద్ద చేపల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి మురుగుకాలువలోకి బోల్తాపడగా లోడుపై కూర్చున్న పదిమంది ప్యాకింగ్ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. చేపల లోడుపై కూర్చుని వెళ్తున్న కార్మికుడు సడన్ బ్రేక్ వేయడంతో కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. ధాన్యం లోడు పైకూర్చుని వెళ్తున్న కార్మికులు బస్తాలు జారి పడటంతో వాటితోపాటే కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. ఇక ఆటోలు, మినీ ట్రక్కు లారీలు, ట్రాక్టర్లు వంటి వాటిపై పరిమితికి మించి ప్రయాణీకులు కిక్కిరిసి కూర్చుని ప్రయాణాలు చేస్తున్నారు. ట్రక్కులు, ఆటోల వెనుక భాగంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక సీటుపై కూర్చుని ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనల్లో అనేక మంది క్షతగ్రాత్రులు అవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఇలాంటి ప్రయాణాలను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.



ట్రాక్టరు ట్రక్కులో లోడుపై ప్రయాణం



కొబ్బరికాయలలోడుపై కూర్చున్న కార్మికులు



లారీలోడుపై ప్రమాదకరంగా ప్రయాణం

తుఫాన్ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన



ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరి చేలు (ఫైల్)

దెందులూరు: ఇటీవలకురిసిన భారీ వర్షాలు, తుఫాన్ కారణంగా మండలంలో దాదాపు గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. అకాలంగా వచ్చిన భారీ వర్షాలకు పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ మంగళవారం వాయుగుండం కారణంగా భారీ వర్షాలు కురవనున్నా యని వాతావరణ శాఖ విడుదల చేసిన ప్రకటన రైతులందరినీ తీవ్ర ఆందోళనకు గురి చేసింది. నేలకొరిగిన వరి పంటను ఎలా కాపాడుకోవాలని, ఒకపక్క ఆలోచిస్తుండగా మళ్లీ తుఫాను ప్రకటన రావడంపై రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. నెలలో 20 రోజులు ఏదో కారణంగా వర్షాలు వస్తే పంటల సాగు కష్టతరమవుతందని, ఆరుగాలం శ్రమించినా ఫలితం ఉండదని రైతులు అంటున్నారు.

డ్రోన్లను వినియోగించాలి



వర్షం వల్ల నేలకొరిగిన వరి పనలనుంచి పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపించే ప్రయత్నం చేశారు. నేలకొరిగిన వరి పనలను నిలబెట్టాలి. నీటమునిగిన పొలాలు తొందరగా పుంజుకోవడానికి 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. తరువాత ఒక లీటరు నీటికి 1 గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలి. డ్రోన్లను వినియోగించడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పురుగు పిచికారీ చేసే అవకాశం ఉంది.

– ఏ.సుబ్బారావు, వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్

కవ్వగుంటలో ఓ వర్గంపై దాడి



బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

- రోడ్డుపై భైఠాయించి న్యాయం కోసం బాధితుల నినాదాలు
- సీఐ హామీతో సమస్య పరిష్కారం

పెదవేగి : ఇతర జిల్లా నుంచి వచ్చి స్థానికంగా నివాసం ఏర్పరచుకొని జీవిస్తుంటే సహించలేని కొందరు మీరు స్థానికులే కాదంటూ ఒక వర్గంపై దాడి చేసిన ఘటన ఏలూరు జిల్లాలో పెదవేగి మండలం కవ్వగుంటలో చోటుచేసుకుంది. స్థానికులు కాదంటూ ఒక వర్గం మరో వర్గంపై దాడి చేసిన ఘటన తీవ్ర వివాదానికి దారితీసింది. దీనిపై ఆగ్రహించిన ఓ వర్గం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతానికి చెందిన కొంత మంది ఏళ్ల కాలంగా కవ్వగుంట గ్రామంలో నివసిస్తున్నారు. కొంతమంది స్థానికులు వారిపై దాడులకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం దాడి మహేష్, దాడి సన్యాసినాయుడు, ఆబోతుల సురేష్‌పై మరో సామాజిక వర్గానికి చెందిన బెజవాడ సుబ్బారావు అనే వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. దీంతో దాడి జరిగిన విషయాన్ని స్థానిక నాయకులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో వారు పెదవేగి పోలీసులకు సమాచారం అందించారు. అయినా స్పందన లేకపోవడంతో బాధితులంతా ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన బాధితులు వంగూరు, కవ్వగుంట, జగన్నాథపురం ప్రధాన రహదారిపై టెంట్ వేసి, గంటల తరబడి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. చివరకు పెదవేగి సర్కిల్ సీఐ కె వెంకటేశ్వరరావు వచ్చి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వగా, ఎస్సై కె రామకృష్ణ తన సిబ్బందితో టెంట్‌ను తొలగించి పరిస్థితి చక్కబరిచారు. ఈ దాడి ఘటనలో దాడి మహేష్ ఫిర్యాదు మేరకు నాగసాయి, బెజవాడ క్రాంతి మరో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీహెచ్‌సీలో కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు వెంకటరెడ్డి, చిత్రంలో సూపరింటెండెంట్ డాక్టర్ సునీత

భీమడోలు: భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో నాగహనుమాన్ సాల్వెట్ యాజమాన్యం ఆర్థిక సాయంతో ఈ శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి శిబిరానికి హాజరైన 95 రోగులకు కంటి వైద్య నిపుణులు జే వెంకటరెడ్డి, ఎం.దివ్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందించారు. తొలుత ఈ శిబిరాన్ని సునీత ప్రారంభించారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులు తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రతి రోజు వ్యాయామం ద్వారా బీపీ, సుగర్ వంటి రోగాలు నియంత్రించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, సీహెచ్‌వో ఇందిరా, ఎంపీహెచ్ఎస్ రామకృష్ణ, ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌సీ సిబ్బంది, నాగహనుమాన్ ఫ్యాక్టరీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డ్రెయిన్ సమస్యలు పరిష్కరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: మండలంలోని ముప్పవరంలో ఆక్రమణకు గురైన ఇరిగేషన్ డ్రెయిన్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి దెందులూరు తహసీల్దార్ బి. సుమతిని ఆదేశించారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో మీకోసం కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తహసీల్దార్‌తో మాట్లాడారు. ఈ సమస్యను పరిష్కరించకుండా క్లోజ్ చేస్తే మెమోలిస్తామన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనచేసి వెంటనే ఆక్రమణ తొలగించి ప్రజాప్రయోజనంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ముప్పవరం వెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఇన్‌ఛార్జి ఎంపీడీవో భీమరాజు, జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు అధికారులు తూతూమంత్రంగా హాజరయ్యారు.

ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు



పూళ్ల పంచాయతీలో ఆక్రమణలు తొలగించాలని అధికారులకు విన్నవిస్తున్న సాయన్నపాలెం గ్రామస్తులు కర్రి నాగిరెడ్డి, సుబ్బిరెడ్డి

భీమడోలు: పూళ్ల పంచాయతీ పరిధిలోని పూళ్ల, ఎంఎంపురం, సాయన్నపాలెం గ్రామాల్లోని ప్రధాన రహదారులు ఆక్రమణలకు గురయ్యాయని, ఆక్రమణలు తొలగించాలని సాయన్నపాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి నాగిరెడ్డి, సుబ్బిరెడ్డి మండలస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో హాజరైన ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ బి.రమాదేవి, వివిధ శాఖాధికారులు హాజరయ్యారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆక్రమణలను తొలగించి రోడ్లపై వాహనాల రాకపోకలకు అనువుగా ఏర్పాట్లు చేయాలని కోరారు. పంచాయతీ సర్వసభ్య సమావేశంలో ఇదే విషయంపై ఆక్రమణలు తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి మూడేళ్లు పూర్తయినా నేటికీ అమలు చేయలేదని, ఇకనైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గుండుగొలను నాందీ వాటర్ ప్లాంట్‌ను పంచాయతీ స్వాధీనం చేసుకుందని, నేటికీ నాందీ వాటర్ ప్లాంట్ యాజమాన్యమే నిర్వహిస్తోందని, ప్రజల నుంచి వాటర్ టిన్నుల నిమిత్తం వసూలు చేసిన సొమ్మును స్వాహా చేస్తోందని, వెంటనే ఆ సొమ్ము పంచాయతీకి జమ అయ్యేలా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని 2వ వార్డుకు చెందిన కొక్కిరిపాటి నాగమాణిక్యాలరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. భీమడోలు జంక్షన్‌లోని కల్యాణ మండపం వద్ద రాత్రి వేళల్లో వివాహ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చుతూ, భీకర ధ్వనులతో ఆ ప్రాంత వాసులుగా తాము ఇబ్బందులు పడుతున్నామని ఆ ఏరియా వాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వివిధ శాఖలకు చెందిన సమస్యలపై ఫిర్యాదు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పోలసానిపల్లి చెరువు గట్టుపై మొక్కలు నాటుతున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం

భీమడోలు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పోలసానపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం అన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వీ ఆదేశాల మేరకు సోమవారం పోలసానిపల్లిలోని యర్రంచెరువు చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ మొక్కలు నాటారు. చెరువు గట్టు పటిష్టానికి ఉపయోగపడే మొక్కలను నాటారు. గ్రామంలోని చెట్లను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో స్వేచ్ఛమైన గాలి అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యు.జయరామకృష్ణ, వార్డు సభ్యులు అనంతమ్మ, భీమడోలు రామకృష్ణ, నానాది రాజారత్నం, పెద్దలు షేక్ హసీనా, మద్దు శ్రీను, యర్రంశెట్టి సతీష్, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

దెందులూరు: పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలం పరిధిలో సోమవారం నిర్వహించామని జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు అన్నారు. చల్లచింతలపూడి, మేదినరావుపాలెం, వేగవరం తదితర పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ నెలవారీ ప్రమోషన్ల ప్రక్రియ పునరుద్ధరణ, సీపీఎస్ రద్దు, పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం, పదవీ విరమణ పొందుతున్న ఎస్జీటీల స్థానాల్లో తక్షణమే ఉపాధ్యాయుల నియామకం, విద్యా వలంటీర్ల నియామకం వంటి తమ యూనియన్ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి కెవివి సుబ్బారావు, మండల అధ్యక్షుడు జాన్సన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సాంకేతిక పరికరాలకు బాల్యం బందీ

- శారీరక శ్రమకు తోడ్పడే ఆటలకు నేటి బాలలు దూరం
- సెల్‌ఫోన్లు, కంప్యూటర్ గేమ్స్‌పైనే ఆసక్తి
- చిన్నవయస్సులోనే రుగ్మతలబారిన పడుతున్న వైనం



నాడు వీధుల్లో ఆటలాడుతున్న చిన్నారులు (ఫైల్)



నేడు ఇంట్లో సెల్‌ఫోన్‌లో నిమగ్నమైన చిన్నారులు (ఫైల్)

పెదవేగి : ఒకప్పుడు స్కూల్ విడిచిపెట్టారంటే చాలు..ఇళ్లకు వచ్చిన పిల్లలు పుస్తకాల బ్యాగులు పక్కన పెట్టి చకచకా వీధుల్లోకి వెళ్లి రోడ్లపై తోటి బాలలతో కలిసి ఆటలాడుతూ కనిపించేవారు. చీకటి కమ్మేవరకూ, శరీరం అలిసేలా వివిధ రకాల ఆటలు ఆడేవారు. ప్రస్తుతానికి వస్తే సంప్రదాయ ఆటలకు బాల్యం దూరమైంది. సెల్‌ఫోన్లు, కంప్యూటర్ గేమ్స్‌కే పిల్లలు పరిమితమవుతున్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా చిన్నవయస్సులోనే వివిధ రోగాల బారిన పడుతున్నారు. ఒకప్పటి బాల్యం అంటే ఆటలు, పాటలు. నేడు సెల్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లతో కుస్తీలు. ఒకప్పుడు దొంగా పోలీస్, టచ్ మీ నాట్, ఏడు పెంకులాట, క్రికెట్, కర్ర – బిళ్ల వంటి ఆటలు వీధుల్లో ఆడుకుంటూ బాలలు కనిపిస్తుండేవారు. ఇప్పుడు పాఠశాల నుంచి వచ్చిన పిల్లలకు శారీరక వ్యాయామం తగ్గిపోతోంది. పాఠశాలలో ఎక్కువ సమయం పుస్తకాలతోనే కుస్తీ పట్టకుండా కొంత సమయం శారీరక వ్యాయామం కలిగించే ఆటలకు కేటాయిస్తే ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆటలు ఆడుకునే విద్యార్థులు చదువులోనూ ముందంజలో ఉంటారని, గెలుపు, ఓటములను తట్టుకునే సామర్థ్యం అలవడుతుందని సర్వేలు చెబుతున్నాయి.

దెందులూరు నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 24 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అన్ని పాఠశాలల్లో క్రీడా స్థలాలు లేక పోయినా ఉన్న కొద్దిపాటి స్థలాన్ని అయినా ఉపయోగించుకుని క్రీడల్లో పాల్గొనాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. విద్యార్థి దశలో ఆటలు సరదాను నింపడంతోపాటు భావోద్వేగాల నియంత్రణకు తోడ్పతాయి. శారీరక, మానసిక ఆరోగ్యానికి బాటలు వేస్తాయి. ఒక్కో ఆట ఒక్కో రకంగా విద్యార్థులకు మేలు చేస్తాయి. ఆటల్లో ఒక జట్టుగా ఏర్పడటం ద్వారా సామాజిక బంధాలు మెరుగుపడతాయి. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం అలవడుతుంది. కార్పొరేట్ విద్యతో ఒత్తిడికి గురైన విద్యార్థులు ఆత్మన్యూనతకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలను చూస్తున్నాం. ఆటలు విద్యార్థుల ఒత్తిడిని దూరం చేయడానికి దోహదం చేస్తాయని విద్యావేత్తలు అంటున్నారు.